



కడపలో జరిగిన ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిని శ్వేతకు అందిస్తున్న వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరిక్రిష్ణ, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ అబ్బిగారి నరసయ్య, బ్యూరో ఇన్‌చార్జ్ ఎక్కంటి ఆంజనేయులు, మాజీ కార్పొరేటర్ సరస్వతమ్మ తదితరులు



కడపలో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు



కడప వికాస్ హైస్కూల్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు



రాజంపేట శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు



రాయచోటిలో ముగ్గుల పోటీకి పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు



రాయచోటిలో రమ్యకు ప్రథమ బహుమతిని అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, చిత్రంలో మంత్రి మండిపల్లి సతీమణి హరిత, అర్చన విద్యాసంస్థల అధినేత మదన్‌మోహన్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి కడప ఎడిషన్ ఇన్‌చార్జ్ సుంకోజ దేవేంద్రాచారి




రాయచోటిలో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు

అవనిపై హరివిల్లు..

- అంగరంగ వైభవంగా ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు
- నూతన శోభను సంతరించుకున్న రాజంపేట శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణం
- కడప వికాస్ హైస్కూల్‌లో పండుగ వాతావరణం
- రాయచోటి అర్చన కాలేజిలో మహిళల సందడే..సందడి..



రాజంపేటలో ముగ్గుల పోటీల్లో మొదటి విజేత పి.సుమలతకు బహుమతి ప్రదానం చేస్తున్న శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ శరత్‌కుమార్‌రాజు, కుటుంబ సభ్యులు, ఆంధ్రజ్యోతి సెకండ్ ఇన్‌చార్జ్ కొండూరు కృష్ణమరాజు, రాజంపేట పీసీ ఇన్‌ఛార్జి ఎం.రామచంద్రయ్య, ఏడీవీటీ మేనేజర్ శ్రీధర్ తదితరులు



రాజంపేటలో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు

కడపలో...

కడప కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రానున్న సంక్రాంతి పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని మన సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో చేపట్టిన చుక్కల రంగవల్లుల పోటీతో పుడమితల్లి శోభిల్లింది. 19 సంవత్సరాలుగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సారథ్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఆదివారం స్థానిక ఐటీఐ సమీప వికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఆంధ్రజ్యోతి ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్... ఫ్యాషన్ పార్టనర్ డిగ్ సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సహకారంతో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలకు ఉత్సాహంగా మహిళలు, యువతులు పాల్గొన్నారు. ఉదయం 9గంటల నుంచే మహిళలు, యువతుల ముగ్గుల పోటీలు జరిగే కేంద్రానికి ఉత్సాహంగా చేరుకుని వారి పేర్లు నమోదు చేసుకున్నారు. వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరిక్రిష్ణ మాట్లాడుతూ మహిళలకు... సంప్రదాయాలకు విలువనివ్వడం ఆంధ్రజ్యోతికే సొంతమని తెలిపారు. 2025 నూతన సంవత్సరంలో మొట్టమొదటి పండుగ సంక్రాంతి పర్వదినం అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల లోగిళ్ళలో మూడు రోజుల పాటు సంతోషకరంగా సంబరాలు అంబరాన్నంటేలా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. రానున్న సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాలలో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఆంధ్రజ్యోతి కడప బ్రాంచ్ మేనేజర్ అబ్బిగారి నరసయ్య మాట్లాడుతూ ముగ్గుల పోటీలకు మహిళలు పెద్ద ఎత్తున హాజరుకావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పోటీలలో గెలుపోటములు సహజమని, ఓటమిని గెలుపుగా మార్చుకునేలా సాధన చేయాలన్నారు. కడప బ్యూరో ఇన్‌చార్జ్ ఎక్కంటి ఆంజనేయులు మాట్లాడారు. ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా విజయలక్ష్మి, స్వర్ణలత, సరస్వతమ్మ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి సీనియర్ సబ్ ఎడిటర్ దేవినేని వెంకటరమణ, కడప పీసీ ఇన్‌చార్జ్ జాన్ విలియం, రిపోర్టర్‌లు పి.నాగమల్లయ్య, చంద్రారెడ్డి, నాగయ్య, ఏబీఎన్ ఫోటోగ్రాఫర్స్ మౌలా, వీరా, ఫోటోగ్రాఫర్ రత్నయ్య పాల్గొన్నారు.

వీరే విజేతలు

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో ప్రథమ విజేతగా ఎస్.శ్వేత (కడప), ద్వితీయ విజేతగా సునీత (ప్రొద్దుటూరు), తృతీయ విజేతగా అనూష (ప్రొద్దుటూరు) నిలిచారు.

రాజంపేటలో..

రాజంపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్, శాన్వి ఇంటర్నేషనల్ పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. 'ఆంధ్రజ్యోతి ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్... ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' సహకారంతో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలకు రాజంపేట, కోడూరు, ప్రొద్దుటూరు చుట్టుపక్కల అనేక గ్రామాల నుంచి సుమారు 100 మంది పైబడి మహిళలు హాజరై రంగవల్లులు వేశారు. ఈ సందర్భంగా మహిళలు పోటీలు పడి మన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడే రీతిలో పోటాపోటీగా ముగ్గులు వేశారు. దీంతో శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణం రంగవల్లులతో కొత్తశోభను సంతరించుకుని సంక్రాంతి పండుగను ముందుగానే ఆహ్వానించినట్లు అయింది. శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కొండూరు కుటుంబీకుల చేత విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద 6 వేలు, 4 వేలు, 3 వేల రూపాయల చొప్పున అందజేశారు. మరో 10 మందికి వెయ్యి రూపాయలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హాజరైన వారందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేసి ప్రతి ఒక్కరికీ భోజన సౌకర్యాన్ని శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ వారు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు, సీఈవో శంకర్‌రాజు, డైరెక్టర్‌లు భరత్‌కుమార్ రాజు, ప్రణతి, ఆంధ్రజ్యోతి సెకండ్ ఇన్‌చార్జ్ కొండూరు కృష్ణంరాజు, రాజంపేట ఆంధ్రజ్యోతి పీసీ ఇన్‌చార్జి ఎం.రామచంద్రయ్య, ఏడీవీటీ మేనేజర్ బట్టు శ్రీధర్, స్కూల్ ప్రిన్సిపాల్ విజయనిర్మల, వైస్ ప్రిన్సిపాల్ జయశ్రీ, కార్యనిర్వాహకులు సంపూర్ణ, ప్రభాకర్, కొండూరు సుగుణమ్మ, కృష్ణవేణి, ఏబీఎన్ ప్రతినిధి ఈశ్వరయ్య, రాజంపేట పట్టణ ఆంధ్రజ్యోతి విలేకరి ఉదయగిరి కల్యాణ్, ఓబులవారిపల్లె విలేకరి హరి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

రాజంపేటలో జరిగిన ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిని పి.సుమలత (ప్రొద్దుటూరు), ద్వితీయ బహుమతిని పి.విజయలక్ష్మి (కొత్తమాధవరం), తృతీయ బహుమతిని ఆకుల రెడ్డికళ (ఎల్లాగడ్డ, రాజంపేట) అందుకున్నారు. వీరికి వరుసగా 6 వేలు, 4 వేలు, 3 వేలు చొప్పున కొండూరు శరత్‌కుమార్‌రాజు అందచేశారు.

రాయచోటిలో..

రాయచోటి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు రాయచోటి పట్టణం ఎగువ అబ్బవరంలో ఉన్న అర్చన విద్యాసంస్థల ఆవరణలో ఆదివారం అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లేవిధంగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీల్లో 145 మంది మహిళలు పాల్గొనడం హర్షించదగ్గ విషయమన్నారు. పోటీలో పాల్గొన్న మహిళలు ముగ్గులు చాలా బాగా వేశారని, వారందరినీ ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో గత 19 సంవత్సరాలుగా సంక్రాంతి ముగ్గుల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర జ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జ్ సుంకోజి దేవేంద్రాచారి తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా ఈ ముగ్గుల పోటీలు జరుగుతున్నాయన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో కడప, రాయచోటి, రాజంపేటలో ఈరోజు ముత్యాల ముగ్గుల పోటీలు జరిగాయన్నారు. ముత్యాల ముగ్గుల పోటీలు విజయవంతంగా జరిగేందుకు సహకరించిన అర్చన విద్యాసంస్థల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూ.. ఏటా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తోందని ఆంధ్రజ్యోతి అన్నమయ్య జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్ గొనిపల్లె శ్రీనివాసులు అన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీల్లో పాల్గొన్న వాళ్లే నిజమైన విజేతలన్నారు. తెలుగునాట మొదటి పండుగ సంక్రాంతి అని.. ఈ పండుగలో ముగ్గులు ప్రధాన ఆకర్షణ అన్నారు. అందుకే ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో మహిళల కోసం ముగ్గులు పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి ముగ్గుల పోటీ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖా మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత అన్నారు. ఈ ముగ్గులను చూస్తుంటే వారం ముందే సంక్రాంతి వచ్చినట్లుగా ఉందన్నారు. తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి పండుగని, అప్పుడే తెలుగు లోగిళ్లలో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయని అర్చన విద్యాసంస్థల వ్యవస్థాపకులు పి.మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాది సంక్రాంతి ముగ్గుల పోటీలను తమ విద్యాసంస్థల్లో నిర్వహించిన ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు సంక్రాంతి సంబరాలలో భాగంగా ఈనెల 12న అర్చన విద్యాసంస్థల వద్ద బండలాగుడు పోటీలు ఉంటాయని తెలిపారు. సంక్రాంతి పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

విజేతలు వీరే..

పోటీల్లో పాల్గొన్న మహిళలు వేసిన ముగ్గులను జ్యోతి, తేజ, సంధ్య అనే మహిళలు పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. ఇందులో మొదటి బహుమతిని కడపకు చెందిన రమ్య గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతిని లక్ష్మీ, తృతీయ బహుమతిని హిమబిందు గెలుచుకున్నారు. వీరిలో మొదటి బహుమతి విజేతకు అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ చేతుల మీదుగా బహుమతిని అందజేశారు. ద్వితీయ బహుమతి విజేత లక్ష్మీకి రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖా మంత్రి మడిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత చేతుల మీదుగా అందజేశారు. తృతీయ బహుమతి హిమబిందుకు అర్చన విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మదన్‌మోహన్‌రెడ్డి అందజేశారు. ఈ ముగ్గులను హరిత, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ విడివిడిగా పరిశీలించి.. సంతోషం వ్యక్తం చేశారు. రెండు గంటలకుపైగా మహిళలు ఎంతో ఓపికగా ఈ పోటీలో పాల్గొనడం సంతోషకరమన్నారు.

అప్పులు చేయడంలో

వైసీపీ, టీడీపీ దొందూ దొందే

- ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

పులివెందుల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలను పన్నులు, చార్జీలతో బాదడంలో, ప్రజల పేరుచెప్పి అప్పులు చేయడంలో వైసీపీ, టీడీపీ దొందూ దొందే అని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. పులివెందులలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే కూటమి ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.15,485 కోట్ల అదనపు భారం మోపిందన్నారు. త్వరలో భూములు, స్థలాలు, ఇళ్లపై 20 శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచబోతున్నారని, నగరాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాపై యూజర్ చార్జీలు విధించబోతున్నారని తెలిపారు. వస్తువుల రవాణాపై ఒకశాతం సెస్సు విధించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం శోచనీయమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే లక్ష కోట్ల రూపాయల పైచిలుకు అప్పు చేసిందని, స్వర్ణాంధ్ర అంటే ఇదేనా అని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు తిరుపాలరెడ్డి, నాగరాజు, శివ, వెంగల్‌రెడ్డి, ధనుష్, అమర్‌నాథ్‌రెడ్డి, చిన్నకోట నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజెన్‌కో కాంట్రాక్టు కార్మికులకు శుభవార్త

- రూ.7వేలు జీతం పెంపు

ఎర్రగుంట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీజెన్‌కోలో జీవోవో (జెన్‌కో ఆఫీస్ ఆర్డర్) నెంబరు 167 ద్వారా కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. గత ప్రభుత్వం జీవో నెంబరు 167 ద్వారా కాంట్రాక్టు కార్మికులకు కొత్త పీఆర్‌సీ అమలు చేసినప్పుడు ఆగస్టు 2023లో జీతాలు పెంచి ఇచ్చింది. అయినప్పటికీ జెన్‌కోలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేసే వారితో సమానంగా ఈ జీతాలు లేవు. అయితే సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రాగానే జీవోవో నెంబరు 167 ద్వారా తక్కువ జీతాలు తీసుకుంటున్న వారందరికీ జీవో నెంబరు 129 ద్వారా జీతాలివ్వాలని ఆదేశాలిచ్చింది. ఈ మేరకు ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 167 జీవోవో ద్వారా నెలకు రూ.15 వేలు మాత్రమే వస్తుంది. 129 జీవో ద్వారా రూ.22,318 అన్‌స్కిల్డ్ జీతాలు ఇస్తున్నారు. అయితే వీరందరూ 14.08.2023 నాటికే 167 జీవోవో ద్వారా జీతాలు తీసుకుంటూ ఉండాలి. కానీ వీరికి 01.01.2025 నుంచి కొత్త జీతాలు అమల్లోకి వస్తున్నాయి. ఆర్టీపీపీలో పనిచేసే సుమారు 160 మంది ఈ జీవో ద్వారా లబ్ధి పొందనున్నారు. వారికి జీవోవో నెంబరు 129 ద్వారా అన్‌స్కిల్డ్ వేతనం రూ.22వేలు ఇకపై తీసుకుంటారు. సుమారు రూ.7వేల వరకు జీతం పెరగనుంది. కాగా జీతాలు పెంచడంతో కార్మికులు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యువతకు 'చిరు'చేయూత

పులివెందుల వద్ద ఉన్న ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కాలేజ్‌లో చిరుధాన్యాల తయారీ యూనిట్ ఏర్పాటైంది. దీనిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా మూడు మాత్రమే మంజూరు కాగా.. వాటిలో ఒకటి పులివెందులకు కేటాయించారు. ఈ యూనిట్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కల్పించనున్నారు. అలాగే రైతులు పండించిన పంటను అక్కడకు తెస్తే వాటిని మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా మార్చి అందిస్తారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులకు దీని ద్వారా ప్రాక్టికల్‌గా బోధన సాగనుంది.



చిరుధాన్యాల తయారీ యూనిట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు


- నిరుద్యోగులు, రైతులు ఉపయోగించుకునేందుకు వీలుగా..
- పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో ఏర్పాటు
- మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం

పులివెందుల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణ సమీపంలో చిన్నరంగాపురం వద్ద ఉన్న ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల రోజురోజుకు విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందిస్తూ వారికి మార్కెటింగ్ విధానాన్ని సైతం నేర్పుతోంది. ఇప్పుడు నూతన విధానానికి నాంది పలికింది. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ (ఐఐపీఎం) వారి సహకారంతో ఇక్కడ చిరుధాన్యాల తయారీ యూనిట్ ఏర్పాటుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఐఐపీఎం ద్వారా మూడు యూనిట్లు మంజూరు చేయగా అందులో ఒకటి పులివెందుల ఏర్పాటు చేశారు. ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు చదువుతో పాటు మార్కెటింగ్ విధానాన్ని ఇక్కడ నేర్చుకుంటున్నారు. ఇక్కడ శిక్షణ పొందాక స్వయంగా విద్యార్థులే ఇలాంటి యూనిట్లు ఏర్పాటుచేసుకుని వారితోపాటు మరికొందరికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుంది. ఈ యూనిట్ నెలకొల్పేందుకు 2022లో ఐఐపీఎం, పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల ఎంఓయూ చేసుకున్నారు. 2023లో ఈ ప్రాజెక్టు నెలకొల్పేందుకు పనులు ప్రారంభమయ్యాయి. 2024లో దీనిని వినియోగంలోకి తెచ్చారు. పులివెందులలోనే దీనిని ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకంటే రాయలసీమలో చిరుధాన్యాల సాగు ఎక్కువగా ఉండటం.

నిరుద్యోగులకు శిక్షణ ఉచితం

నిరుద్యోగులు చిరుధాన్యాల తయారీ యంత్రాలపై శిక్షణ పొందేందుకు కళాశాల యాజమాన్యానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వారు దరఖాస్తు చేసుకుంటే శిక్షణ పూర్తిగా ఉచితంగా అందిస్తారు. శిక్షణ పూర్తయిన విద్యార్థులు సొంతంగా ఇలాంటి చిరుధాన్యాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. లేదంటే రైతుల వద్ద పంటను కొనుగోలు చేసి ఈ ప్రాసెసింగ్ యూనిట్‌కు తెచ్చి వారికి కావాల్సిన విధంగా తయారుచేసుకుని మార్కెటింగ్ చేసుకోవచ్చు. అలాగే రైతులు పండించిన పంట వారే స్వయంగా ఈ యూనిట్‌కు తీసుకువస్తే మినిమమ్ చార్జి వసూలు చేసి వారికి కావాల్సిన విధంగా తయారు చేసి ఇవ్వనున్నారు.

యూనిట్ ఎంతో ఉపయోగకరం..



కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు యూనిట్లు మంజూరు చేసింది. అందులో ఒకటి పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలకు రావడం ఈ ప్రాంతానికి ఎంతో ఉపయోగకరం. ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్, బెంగళూరు వారి సహకారంతో ఇక్కడ మిల్లెట్ ప్రాసెస్ యూనిట్ ఏర్పాటు చేశాం. నిరుద్యోగ యువతకు ఈ యూనిట్‌లో శిక్షణ పూర్తిగా ఉచితంగా ఇస్తాం. శిక్షణ పూర్తయ్యాక సొంతంగా వ్యాపారం చేసుకునేందుకు వీలుంటుంది.

– మాధవ, అసోసియేట్ డీన్, ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ, పులివెందుల

రాళ్లు, కర్రలతో ఇరువర్గాల ఘర్షణ

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- ఉద్రిక్త వాతావరణంలో ఎన్.గొల్లపల్లె

6



సీమ సమస్యలు పట్టించుకోరా..?

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



వివరాలు...6లో

ముందస్తు సంక్రాంతి శోభ

- ఆకట్టుకున్న ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ముగ్గులు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

కడప కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీకి విశేష స్పందన లభించింది. కడప, రాయచోటి, రాజంపేటలలో జరిగిన ముగ్గుల పోటీలకు మహిళలకు అధిక సంఖ్యలో పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. కడప జిల్లా 19 సంవత్సరాలుగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సారథ్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం స్థానిక ఐటీఐ సమీప వికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఆంధ్రజ్యోతి ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి ఫర్‌ఫెక్ట్... ఫ్యాషన్ పార్టనర్ డిగ్ సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సహకారంతో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలకు ఉత్సాహంగా మహిళలు, యువతులు పాల్గొన్నారు. వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరిక్రిష్ణ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసి ముగ్గుల పోటీలను విజయవంతంగా నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పదిమందికి కన్సొలేషన్ బహుమతులు పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందచేశారు.

12 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా పాల్గొంటున్నా...

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలలో 12 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా పాల్గొంటున్నా. రాష్ట్ర స్థాయి పోటీలకు రెండుసార్లు వెళ్లాను. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు వెలిబుచ్చారు.

-ఎస్.శ్వేత, మొదటి బహుమతి (కడప).

ఏడుసార్లు పోటీల్లో పాల్గొన్నా...

ఇప్పటివరకు ఏడుసార్లు ముగ్గుల పోటీలలో పాల్గొన్నా. ఈరోజు ద్వితీయ విజేతగా ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. వచ్చే సంవత్సరం ప్రథమ విజేతగా నిలిచేందుకు కృషి చేస్తా.

- సునీత, ద్వితీయ బహుమతి (ప్రొద్దుటూరు)

మొదటిసారి పాల్గొన్నా...

ముగ్గుల పోటీలలో మొట్ట మొదటిసారి పాల్గొన్నా. తృతీయ విజేతగా ఎంపిక కావడం చాలా సంతోషాన్నిచ్చింది. మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

-జి.అనూష, తృతీయ బహుమతి (ప్రొద్దుటూరు)

రాజంపేటలో...

రాజంపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజంపేటలోని శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఉదయం జరిగిన ముత్యాల ముగ్గుల పోటీలకు మహిళలు పోటెత్తారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగువల్లులు తీర్చిదిద్దారు. 'ఆంధ్రజ్యోతి ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి ఫర్‌ఫెక్ట్... ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' సహకారంతో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలకు రాజంపేట, కోడూరు, ప్రొద్దుటూరు చుట్టుపక్కల అనేక గ్రామాల నుంచి సుమారు 100 మంది పైబడి మహిళలు హాజరై రంగవల్లులు వేశారు. ముగ్గులు వేసిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతుల కింద 10 మందిని ఎంపిక చేసి వారికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున 10 వేల రూపాయల మొత్తాన్ని అందజేశారు. వారిలో భవితరామం, వి.మరిని, పి.అరుణ, ఆర్.ప్రవల్లిక, నాగమ్మ, వి.సంధ్య, వి.దివ్య, జి.నవీన, ఎస్.విజయలక్ష్మీ, లక్ష్మీదేవి, రెడ్డికళ, విజయలక్ష్మీ, సుమలత ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. మిగిలిన సుమారు 90 మందికి స్టీల్ క్యారియర్ ప్రోత్సాహక బహుమతి కింద అందజేశారు. న్యాయనిర్ణేతలుగా రేణుక, సరిత, సుభద్రమ్మలు వ్యవహరించారు. గిఫ్ట్ హ్యాంపర్‌ల లోగోలను సుప్రజ, కావేరి, నందిని, లక్ష్మీప్రసన్న, రేవతి వేశారు.


కడపలో ముగ్గులను పరిశీలిస్తున్న స్కూల్ ప్రతినిధులు, ఆంధ్రజ్యోతి సిబ్బంది, న్యాయ నిర్ణేతలు


రాజంపేటలో ముగ్గులను పరిశీలిస్తున్న స్కూల్ ప్రతినిధులు, న్యాయనిర్ణేతలు, ఆంధ్రజ్యోతి సిబ్బంది


రాయచోటిలో ముగ్గులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదన్‌మోహన్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి సిబ్బంది

5 సార్లు ప్రథమ బహుమతి పొందాను...

నేను ఇప్పటివరకు 5 సార్లు ప్రథమ బహుమతి పొందాను. కడప, రాజంపేటలలో జరిగిన పోటీల్లో పాల్గొన్నాను. నేను ప్రొద్దుటూరులో టైలరింగ్, మ్యాచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నాను. నా భర్త వీరభద్రుడు (బేల్దారి) ప్రోత్సాహంతో ఇప్పటికే కడప, రాజంపేట తదితర ఆంధ్రజ్యోతి ఏబీఎన్ నిర్వహిస్తున్న పోటీల్లో పదేళ్లుగా పాల్గొంటున్నాను. వాటిల్లో 5 సార్లు ప్రథమ బహుమతి పొందగా మిగిలిన సార్లు ద్వితీయ, తృతీయ బహుమతులు పొందుతూనే ఉన్నాను. ఇది నాకెంతో ఆనందంగా ఉంది. ఈ ముగ్గులను ప్రోత్సహించడం వల్ల మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుంది. ఇందుకు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

- వి.సుమలత (ప్రథమ బహుమతి), ప్రొద్దుటూరు.

చాలా ఆనందంగా ఉంది...

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. పోటీల్లో నాకు రెండో బహుమతి రావడంతో ఎంతో సంతోషంగా ఉంది. మహిళలను ప్రోత్సహిస్తున్న ఆంధ్రజ్యోతి వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

- విజయలక్ష్మీ (ద్వితీయ బహుమతి), కొత్తమాధవరం

ఆంధ్రజ్యోతి వారికి కృతజ్ఞతలు

మహిళలను ప్రోత్సహిస్తున్న ఆంధ్రజ్యోతి వారికి నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ముగ్గుల పోటీల్లో మూడో బహుమతి 3 రూపాయలు రావడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఇలాగే మహిళలను ప్రోత్సహిస్తూ వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి చేయాలి.

-ఆకుల రెడ్డికళ (తృతీయ బహుమతి), ఎల్లాగడ్డ, రాజంపేట

రాయచోటిలో...

రాయచోటి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు రాయచోటి పట్టణం ఎగువ అబ్బవరంలో ఉన్న అర్చన విద్యాసంస్థల ఆవరణలో ఆదివారం అట్టహాసంగా జరిగాయి. ఆకాశంలోని హరివిల్లు నేలపై వాలిందా అన్నట్లుగా.. వారం రోజుల ముందుగానే.. సంక్రాంతి సంబరాలు మొదలైనట్లుగా.. మహిళలు పోటీ పడి మరీ ముగ్గులు వేశారు. ఎలాగైనా బహుమతి గెలవాలనే పట్టుదలతో 145 మంది పోటీలలో పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహిళలు ముగ్గులు వేశారు. చుక్కల ముగ్గులకు.. రంగురంగులు వేసి.. అలంకరించారు. ఈముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ ముగ్గుల పోటీల సందర్భంగా అర్చన విద్యాసంస్థల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. పలు పాటలకు విద్యార్థులు డాన్సులు వేశారు.

చాలా సంతోషంగా ఉంది

నాకు ఈ ముగ్గుల పోటీలో మొదటి బహుమతి రావడం చాలా సంతోషంగా ఉంది. గత ఏడాది కడపలో జరిగిన పోటీలలో పాల్గొన్నా.. బహుమతి రాలేదు. ఈసారి ఎలాగైనా బహుమతి సాధించాలనే.. ముగ్గు వేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నా. ఈ పోటీలో పాల్గొనడానికి కడప నుంచి వచ్చాను.. రాష్ట్ర స్థాయిలో కూడా మొదటి బహుమతిని సాధించాలని అనుకుంటున్నా..

- రమ్య, మొదటి బహుమతి విజేత, కడప

బహుమతి ఏదైనా.. సంతోషమే

పోటీలో పాల్గొనడే ముఖ్యం. బహుమతి ఏదైనా సంతోషమే. వచ్చే సంవత్సరం మొదటి బహుమతి సాధించాలని అనుకుంటున్నా.. ఆంధ్రజ్యోతి ఈ పోటీలు నిర్వహించడం గొప్ప విషయం.

- లక్ష్మి, ద్వితీయ బహుమతి విజేత


రాజంపేటలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు


రాజంపేటలో తృతీయ బహుమతి పొందిన ముగ్గు


రాజంపేటలో విజయలక్ష్మికి ద్వితీయ బహుమతి అందచేస్తున్న శరత్‌కుమార్‌రాజు కుటుంబ సభ్యులు


రాజంపేటలో ఆకుల రెడ్డికళకు తృతీయ బహుమతి అందచేస్తున్న దృశ్యం


రాజంపేటలో పదిమందికి కన్సొలేషన్ బహుమతులు అందచేస్తున్న శరత్‌కుమార్‌రాజు, తదితరులు


రాయచోటిలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు


తృతీయ బహుమతి పొందిన ముగ్గు


ద్వితీయ బహుమతిని అందజేస్తున్న మంత్రి మండిపల్లి సతీమణి హరిత


తృతీయ బహుమతిని అందజేస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

గత ఏడాదీ తృతీయ బహుమతే

-గత ఏడాది ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలో పాల్గొని తృతీయ బహుమతిని సాధించాను. ఈసారీ తృతీయ బహుమతే వచ్చింది. మొదటి బహుమతి సాధించాలనే లక్ష్యంతోనే.. పోటీలో పాల్గొన్నా..అయితే తృతీయ బహుమతితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

-హిమబిందు, తృతీయ బహుమతి విజేత


కడపలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు


కడపలో తృతీయ బహుమతి పొందిన ముగ్గు


కడపలో సునీతకు ద్వితీయ బహుమతి అందచేస్తున్న వికాస్ హరిక్రిష్ణ, అబ్బిగారి నరసయ్య, ఆంజనేయులు


కడపలో తృతీయ బహుమతిని అందచేస్తున్న దృశ్యం

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య


తోట రామాంజనేయులు (ఫైల్)

పోరుమామిళ్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన దమ్మనపల్లెలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోరుమామిళ్ల మండలం దమ్మనపల్లె గ్రామానికి చెందిన తోట రామాంజనేయులు (42) అనే రైతు వ్యవసాయం కోసం దాదాపు రూ.13 లక్షలు అప్పులు చేశాడు. గత ఏడాది వరి చేయగా పంట పూర్తిగా దెబ్బతింది ఈ ఏడాది మూడు ఎకరాల్లో టమోటా, ఐదెకరాల్లో వరి సాగు చేసినా.. సక్రమంగా పంటలు చేతికి రాక తీవ్రంగా నష్టపోయాడు. ఈ నేపథ్యంలో అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపానికి గురై డిసెంబరు 30న విషద్రావణం తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అదృశ్యమైన వృద్ధురాలు పెన్నానదిలో శవమైతేలింది


బెల్లంకొండ దస్తగిరమ్మ (ఫైల్)

ప్రొద్దుటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని మోడం పల్లెకు చెందిన బెల్లంకొండ దస్తగిరమ్మ(68) ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమై పెన్నానదిలో శవమై తేలిన సంఘన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే దస్తగిరమ్మ ఈ నెల 2న మోడంపల్లెలోని ఇంటి నుంచి ఆమె బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో వారి కుటుంబసభ్యులు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు 4వ తేదీ టూటౌన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం పెన్నానదిలో దస్తగిరమ్మ శవమై తేలింది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ జూనియర్, జూనియర్ జిల్లా హాకీ జట్ల ఎంపిక



పులివెందుల టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కడప జిల్లా సబ్ జూనియర్, జూనియర్ హాకీ జట్లను ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 60మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం స్థానిక వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ హాకీ స్టేడియంలో నిర్వహించిన సెలక్షన్స్‌లో జిల్లా నలుమూలల నుంచి పాల్గొన్న క్రీడాకారుల్లో మంచి ప్రతిభ కనబరిచిన వారిని హాకీ కడప జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. కార్యక్రమాన్ని రిటైర్డ్ పీఈటీ క్రిష్ణమూర్తి, హాకీ సెక్రటరీ శేఖర్ పర్యవేక్షించారు. ఖాన్‌బాషా, అనిల్ కుమార్, డేవిడ్, ఉదయ్‌దీప్, శౌరికుమార్, దినకర్, రవికుమార్ పాల్గొన్నారు.

ఇండోర్ ట్రైనింగ్‌కు మున్సిపల్ కమిషనర్

ప్రొద్దుటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) కెపాసిటీ బిల్డింగ్స్ ఫర్ అర్బన్ శానిటేషన్ అండ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో మధ్యప్రదేశ్ రాష్ట్రం ఐఎంఎం ఇండోర్‌లో జనవరి 6 నుంచి 9 వరకు నిర్వహించే నేషనల్ ట్రైనింగ్ ప్రొగ్రాంకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి ప్రొద్దుటూరు, చిత్తూరు కమిషనర్లు ఎంపికైన వారిలో ఉన్నారు.

డీఈఓ మీనాక్షిని వెంటనే తొలగించాలి:పీడీఎస్‌యూ


విలేకరులతో మాట్లాడుతున్న అంకన్న

కడప ఎడ్యుకేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నిత్యం వివాదాస్పంగా వ్యవహరిస్తున్న డీఈఓ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకొని వెంటనే తొలగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా చరిత్రలోనే 24 ఉపాధ్యాయ సంఘాలు ఒక్కటిగా చేరి జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షిని తొలగించాలని డిమాండ్ చేయడం ఇదే తొలిసారి అన్నారు. మీనాక్షి జిల్లాలో ఏ పాఠశాలకు వెళ్లినా ఉపాధ్యాయులు భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ఆమె సైకో ప్రవర్తన వల్ల ఒక ఉపాధ్యాయుడు మృతిచెందాడని, దీంతో ఆయన కుటుంబం రోడ్డున పడిందన్నారు. డీఈఓ, సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే సిబ్బందిని కూడా వేధిస్తోందన్నారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ జోక్యం చేసుకొని డీఈవోను ప్రభుత్వానికి సరెండర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు మనోజ్, అన్నమయ్య జిల్లా పీడీఎస్‌యూ నాయకుడు మహేష్ పాల్గొన్నారు.

8 నుంచి పింఛన్ల పరిశీలన

కమలాపురం రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : గతంలో పొందిన వికలత్వపు సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీవో జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8న డాక్టర్ల బృందం నేరుగా పింఛనుదారుల ఇంటి వద్దకు వచ్చి పరిశీలిస్తారన్నారు. పింఛన్ చెక్ చేసి మెడికల్ అధికారి లాగిన్‌లో వివరాలు నమోదు చేసి డీఎంహెచ్‌వోకు నివేదిక సమర్పిస్తారన్నారు. గత ధ్రువీకరణపత్రాన్ని రద్దుపరచి చెక్ చేసి సరిగా ఉన్న వారికే తిరిగి ధ్రువీకరణ పత్రం ఇస్తారన్నారు.

రాజకీయాలకు అతీతంగా ఉద్యోగ అవకాశాలు

● పులివెందులలో ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు ● జాబ్‌మేళాలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



పులివెందుల జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి... హాజరైన నిరుద్యోగులు

పులివెందుల రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులందరికీ ప్రతిభ ఆధారంగానూ, రాజకీయాలకు అతీతంగానూ ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సీడాప్ - ఏపీ ఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను ఆదివారం స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ రెకమెండేషన్ ఉంటేనే ఉద్యోగాలు వస్తాయని ఎంతోమంది నిరుత్సాహంగా ఉన్నారన్నారు. ఇలాంటి వారికోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జాబ్ మేళాకు తోడ్పాటునందించారన్నారు. పులివెందులకు 26 ప్రముఖ కంపెనీలను రప్పించామన్నారు. చిన్న ఉద్యోగం, చిన్న జీతం అనుకోకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఇక్కడి నిరుద్యోగ యువతకు ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు త్వరలో పులివెందులలో ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ జాబ్‌మేళాలో ఉద్యోగం రాని వారికి శిక్షణ ఇప్పించి ఉద్యోగం ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. జాబ్‌మేళా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సాగింది. పులివెందుల ఏపీఎం గురురాజ్, వేముల ఏపీఎం ఆంజనేయులు, డీఆర్‌డీఏ పాల్గొన్నారు.

831 మందికి ఉద్యోగాలు

పులివెందులలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఎల్‌ఐసీ, పేటీఎం, టాటా ఎలక్ట్రానిక్స్ టెక్ మహీంద్ర, ఆదిత్య బిర్లా, అజిల్ ఎయిర్ పోర్ట్స్, డిక్సన్, అమర్‌రాజ, హెటిరో, ఐసీఐసీఐ బ్యాంక్ ఇలా మొత్తం 26 కంపెనీలు పాల్గొన్నాయి. 2325 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 831 మందికి ఉద్యోగాలు లభించినట్లు తెలిపారు. 203 మంది షార్ట్‌లిస్ట్‌లో ఉన్నట్లు సీడాప్ జేడీఎం వివరించారు. ఈ జాబ్‌మేళకు 3453 మంది రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిపారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

● సుందరరామరాజు

కడప ఎడ్యుకేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు అధికమయ్యాయని, వాటిని అరికట్టాలని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి సుందరరామరాజు అన్నారు. ఆదివారం కడప నగరం ఓంశాంతి నగర్‌లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాయలసీమ జోన్ కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ప్రదీప్‌రెడ్డి, జయవర్ధన్ ఆధ్వర్యంలో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి, సీఆర్‌వీ ప్రసాద్, సుబ్బరాయుడు, నగిలిగుర్రప్ప, దేవరకృష్ణ, అంజి, దాదాపీర్‌లతో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం అఖిలభారత అగ్రగామి మహిళా సమితి జిల్లా కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా మహిళలపై దాడులను అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని, స్వేచ్ఛగా మహిళలు తిరగలేని దౌర్భాగ్య పరిస్థితి రాష్ట్రంలో నెలకొని ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో హోంమంత్రులుగా ఉన్న మహిళలు ఉన్నా మహిళలపై దాడులను అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. అఖిలభారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ నగిలి రాజేంద్ర ప్రసాద్, హరిత, లక్ష్మిదేవి, జయమ్మ, పెద్ద అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఏపీ విశ్వవిద్యాలయాల బృందం


అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న యూనివర్సిటీ అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సును కేరళ రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ సెంటర్ ఆఫ్ బయోటెక్నాలజీ తిరువనంతపురం కేంద్రంలో భారతీయ శాస్త్రం, సంస్కృతం వికసిత్ భారత్ కోసం సాంప్రదాయ జ్ఞానం, ఆధునిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్ర, శనివారం రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 600 మందిపైగా అధ్యాపకులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఏపీలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి, డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం, కడప నుంచి సుమారు 20 మంది పైగా అధ్యాపకులు పాల్గొన్నారు. ఏబీఆర్ఎస్ఎ రాష్ట్ర టెక్నికల్ సెక్రటరీ డాక్టర్ ఎస్.బాలసుబ్రమణ్యం, మౌలానా అబ్దుల్ కలాం, నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జి డాక్టర్ పాండు, డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఇన్‌చార్జి డాక్టర్ జి.ఫణీంద్రరెడ్డి, రాష్ట్ర మీడియా సచాలకులు వి.శివకృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు డాక్టర్ నర్సయ్య, నారపరెడ్డి, నందురెడ్డి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

'హామీని ముఖ్యమంత్రి నెరవేర్చాలి'

కడప మారుతీనగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల జీవన భృతి హామీని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలుచేయాలని ఆ సంస్థ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి కోరారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల జీవనభృతి పెంపుదల గురించి గత 2024 మే 2న నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇంతవరకు అతీగతీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు నెలకు కేవలం రూ.1,000 నుంచి 2,500 మాత్రమే అందుతుందన్నారు. దీంతో వారి కుటుంబాలు ఇబ్బందిపడుతున్నాయన్నారు.

'కేంద్రమంత్రి అమిత్ షా మత విద్వేషి'

కడప కలెక్టరేట్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి అమిత్ షా మత విద్వేషి అని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్ విమర్శించారు. ఆదివారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత రాజ్యాంగం, పార్లమెంట్ వ్యవస్థ, ప్రజాస్వామ్యంపై బీజేపీ దాడులకు దిగిందన్నారు. బీజేపీ పాలనను ఎండగట్టేందుకు కాంగ్రెస్ పార్టీ దశల వారీగా ఉద్యమాలు చేపడుతుందన్నారు. కాంగ్రెస్ నేతలు ఆసిఫ్ ఖాన్, జహరార్, హమీద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని మానేద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పులివెందుల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని మానేద్దాం అని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నినదించారు. ఆదివారం జాతీయ సేవా పథకంలో భాగంగా పులివెందుల పరిధిలోని బ్రాహ్మణపల్లెలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం, అలాగే పశువైద్యశిబిరం నిర్వహించారు. పశువులకు నట్టల నివారణ మందు, గర్భనిర్ధారణ, సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశా రు. పశువ్యాధులపై ప్రజలు చెప్పిన సమస్యలకు పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రత్యే క శిబిరంలో భాగంగా ఈనెల 10వ తేదీ వరకు బ్రాహ్మణపల్లెలో ఉంటూ పలు కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆరో గ్యం, పరిశుభ్రత, ఆహార నియమాలు, కల్తీలు తదితర వాటిపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతులను చేయడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముందుంటారని కొనియాడారు. పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.నరేంద్రరెడ్డి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఎం.నందిని, జూనియర్ డాక్టర్ రూపేష్‌నాయక్, టెక్నీషియన్ ప్రసాదరావు, ట్రైనీ లక్ష్మీపతి, కళాశాల జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి డాక్టర్ జయమ్మ, అధ్యాపకులు డాక్టర్ సాయిశ్రీనివాస్, పీడీ డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

● ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డిమాండ్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున

కడప ఎడ్యుకేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం వెటనే 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్‌ను ప్రకటి తద్వారా మెరుగైన పీఆర్సీ ప్రకటిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారన్నారు. గత ఎన్నికలలో మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం మేరకు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే కనీసం 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.గంగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు 2022 నుంచి పెట్టిన సరెండర్ లీవ్ బిల్లులు మంజూరు కాలేదన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పి.శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు సి.సుదర్శన్‌బాబు, జిల్లా కార్యదర్శి కట్టా గంగాధర్ పాల్గొన్నారు.

9న టెంకాయల వేలం

సికెదిన్నె, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ ఆలయం టెంకాయల వేలం ఈనెల 9వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. టెంకాయలు, తలనీలాలు వేలంలో రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని వేలంలో పాడిన వారికి 1.2.2005 నుండి 31.1.2006 వరకు టెంకాయలు విక్రయించుకునేందుకు వేలంపాట నిర్వహిస్తామని, హెచ్చు పాటదారునికి టెండరు ఇవ్వడం జరుగుతుందన్నారు. టెండర్ దక్కించుకున్న వారు దరావత్తు పోను మిగతా మొత్తం కట్టి విక్రయించుకోవచ్చన్నారు.

రాధాక్రిష్ణ ఆలయంలో 10న ఉత్తర ద్వార దర్శనం

కమలాపురం రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైల్వేగేటు సమీపంలో వెలసిన రాధాక్రిష్ణ ఆలయంలో ఈ నెల 10న ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, పుత్తా సరళమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, ఉత్తర ద్వార పూజ అనంతరం దర్శనం ఉంటుందన్నారు. మూలవిరాట్‌కు తులసీదళాలతో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ స్వామివారిని దర్శించుకుంటే వెయ్యి ఆలయాల్లో ఒకే రోజు స్వామివారిని దర్శించుకున్నంత పుణ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయ నిరసన దినాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సుభాషిణి

కడప మారుతీనగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్కీమ్ కార్మికులైన ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న తలపెట్టిన జాతీయ నిరసర దినాన్ని విజయవంతం చేయాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వద్ద 7న చేపట్టనున్న ఆందోళనలను దిగ్విజయం చేయాలన్నారు. ఇప్పటికైనా ఆశాలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి.. కనీస వేతనం 26 వేలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సాధారణ సెలవులతో పాటు వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద 5లక్షలు, పెన్షన్ కింద 10వేల రూపాయలు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్, ఆశా వర్కర్స్ యూ నియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరియమ్మ, కల్పన, శాంతమ్మ, రమణమ్మ, అమ్ములు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

కమలాపురం రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలోని నిస్సీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా నిస్సి మినిస్టర్ చర్చ్ ఆధ్వర్యంలో సంఘం పెద్దలకు యువతీ యువకులకు ఆటల పోటీలు నిర్వహించామని మినిస్ట్రీ ఫౌండర్ అండ్ డైరెక్టరు సునీల్‌దత్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నిస్సి చర్చ్ ఆధ్వర్యంలో ఆయన మాట్లాడుతూ నిస్సి చర్చ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రార్థనలను ఘనంగా నిర్వహించామన్నారు. అదే విధంగా సంఘం పెద్దలకు యువతీ యువకులకు ఆటల పోటీలు నిర్వహించామని, ఈ ఆటల పోటీల్లో వయసు తేడా లేకుండా అందరూ పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రతి సంవత్సరం నూతన సంవత్సరం ఏడుకా సందర్భంగా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని అందులో గెలుపొందిన వారికి బహుమతులు కూడా అందిస్తున్నామన్నారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించామని తెలిపారు. స్వాతి షారోన్ దత్, సురేశ్‌బాబు పాల్గొన్నారు.

కుక్క దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి

పెండ్లిమర్రి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కుక్క దాడిలో 15గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని వగడాలపల్లెలో చంద్రయ్యకు చెందిన 15 గొర్రె పిల్లలపై కుక్క దాడి చేయడంతో అన్నీ మృతిచెదాయి. ఈ ఘటనలో దాదాపు లక్ష రూపాయల మేర నష్టం జరిగిందని బాధిత కుటుంబం తెలిపింది.

బయోటెక్నాలజీలో వైవీయూ డాక్టరేట్


ఆనంద్‌కుమార్

కడప ఎడ్యుకేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బయోటెక్నాలజీ స్కాలర్ ఆనంద్‌కుమార్‌కు పరిశోధనలో యోగివేమన విశ్వవిద్యాల యం డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసింది. ఈయన ఆ శాఖ ఆచార్యులు ఎ.చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఫిజియోలాజికల్, బయో కెమికల్ అండ్ మాలిక్యులర్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ బ్రౌన్టాప్ మిల్లెట్ (యూరోక్లోయో రామోస(ఎల్) టి.క్యూ.ఎన్గుఇన్) జినోటైప్స్ ఫర్ దేర్ సీడ్ న్యూట్రిషనల్ ప్రొఫైలింగ్ అండ్ ఎబయోటిక్ స్ట్రెస్ టాలరెన్స్' అనే అంశంపై పరిశోధన చేసి రూ పొందించిన సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయ పరీక్షల విభాగానికి సమర్పించారు. వైవీయూ వీసీ మార్గదర్శకంలో నియమితులైన నిపుణుల బృందం స్కాలర్ ఆనందకుమార్ రూపొందించిన పరిశోధన గ్రంథాన్ని అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉందని ధ్రువీకరించారు. ఈ యన పలు జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. జాతీ య, అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. ఈ మేరకు డాక్టర్ ప్రొసీడింగ్స్ వైవీయూ పరీక్ష నిర్వహణ అధికారి ఆచార్య కేఎస్‌వీ కృష్ణారావు జారీ చేశారు.

ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌ను యోగివేమన యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పుత్త పద్మ, బయోటెక్నాలజీ అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సమావేశం

వల్లూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణకు మద్దతుగా వల్లూరులోని మాదిగవాడలో ఆదివారం డేవిస్ యూత్ ఆధ్వర్యంలో స్థానికులు సమావేశాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద ఉన్న ఉద్యోగుల్లో మాల లు 700కు పైగా ఉండగా మాదిగలు దాదా పు 400 ఉన్నారన్నారు. వర్గీకరణను మాలలు తప్ప ఉప కులాలు దాదాపుగా 59 ఉన్నా ఎవరు వ్యతిరేకించడం లేదన్నారు. కేవలం మాలలు తమ స్వార్థం కోసమే ఈ వర్గీకరణ అడ్డుకుంటున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడినటువంటి ఎస్సీ ఉపకులాలన్నింటికీ వర్గీకరణ కల్పించి ఆర్థిక, సామాజిక భరోసాను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఓబులేసు, రామచంద్రయ్య, సుబ్బరాయుడు, నాగసుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, విజయభాస్కర్, ప్రభాకర్, తిలక్,గంగాధర్, ఉత్తయ్య, శ్రీకాంత్, నరసింహ, భరత్, సుబ్బన్న, రాజు శివ, రమణ, తేజ దళితవాడ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలి

● ఎస్టీఎఫ్ అధ్యక్షుడు రామాంజనేయులు



మాట్లాడుతున్న రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్, జనవరి (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు 1వ తారీఖున జీతం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్.టీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను చెల్లించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. 2024 జనవరి, జూలై నుంచి చెల్లించాల్సిన కరువు భత్యంను సంక్రాంతి కానుక ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల శ్రీనివాసులు, బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్ ఏర్పాటుచేసి అంతలోపు ఐఆర్ 35 శాతం ప్రకటించి సంక్రాంతి కానుకగా అందించాలన్నారు. ఈ సమావేశంలో గౌరవ సలహాదారుడు క్రిస్టఫర్ జాన్, శ్రీరాములు, సలాం, ఎల్వీ రవిశంకర్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మెస్, కాస్మటిక్ చార్జీలు పెంచాలి: పీఆర్ఎస్‌వైఎఫ్

వల్లూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు మెస్, కాస్మటిక్స్ చార్జీలు పెంచాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి, యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వల్లూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాల్లో ఉన్నటువంటి విద్యార్థుల సమస్యలపై వారు ఆరాతీశారు. ఈ సందర్భంగా కన్వీనరు ఓరుగంటి నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని, సంక్షేమ హస్టళ్లకు ప్రభుత్వం శాశ్వత భవనాలను నిర్మించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ మెడికల్ చెకప్‌లు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల వితరణ అభినందనీయం


దివ్యాంగుడికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న పోలీసులు

పులివెందుల టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : బ్రెయిలీ డే సందర్భంగా పులివెందుల పోలీసుశాఖ తరఫున రూరల్ సీఐ ఎస్వీ రమణ దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందించడం అభినందనీయమని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ అన్నారు. ఆదివారం బ్రెయిలీ జయంతుత్సవాల్లో భాగంగా పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న దివ్యాంగుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన అంధుల దినోత్సవానికి డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1809లో ఫ్రాన్స్ దేశంలోని ప్యారిస్ సమీపంలో క్రూవే అనే ఒక చిన్న కుగ్రామంలో జన్మించిన లూయిస్ బ్రెయిలీ తన చిన్న వయసులో రెండు కళ్లను కోల్పోయినప్పటికీ తన అసాధారణ ప్రతిభాపాటవాలతో, నిరంతర కృషితో ఆరుచుక్కల స్పర్శతో కూడిన ప్రత్యేక లిపిని కనుగొని అంధుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అనంతరం సీఐ ఆర్థిక సాయంతో రూ.30 వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులను 30 దివ్యాంగుల కుటుంబాలకు డీఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చే యడం జరిగింది. అనంతరం దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. దివ్యాంగుల నెట్‌వర్క్ ఆధ్వర్యంలో దివ్యాం గులు డీఎస్పీ, సీఐలను సత్కరించారు. అనంతరం అంధులను అభ్యుదయ వివాహం చేసుకున్న చిన్న, ప్రమీళను సన్మానించారు. ఈ సందర్భంగా వికలాంగుల శిక్షణ కార్యక్రమాలకు తన వంతుగా రూ.పది వేల విరాళం అందిస్తున్న డీఎస్పీ మురళీనాయక్ ప్రకటించారు. దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సునీల్, కానిస్టేబుల్ పురుషోత్తంరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేతకు గడ్డు కాలం!

● వాతావరణంలో మార్పులు.. ● యంత్రాలతో నూర్పిళ్లు..



పొలంలో అలాగే వదిలేసిన వరి గడ్డి

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో నదులు, కాల్వలు, చెరువుల కింద పూర్తి స్థాయిలో వరి సాగైనా... తుఫాన్లు, వర్షాల కారణంగా ఎండుగడ్డికి కొరత ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో వరి ఆశాజనకంగా దిగుబడులు వచ్చాయి. కోతల సమయంలో కురిసిన వర్షాలకు వరి పనలు తడిసిపోయాయి. అదును దాటేలోగా కోతలు కోసి నూర్పిడి చేయాలంటే కూలీల కొరత అధికంగా ఉండడంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. యంత్రాలతో నూర్పిడి చేస్తే పశువులకు ఎండు గడ్డి లేకుండా పోతుందని రైతులు చెబుతున్నారు.

● వర్షాలకు తడిసి...

వరికోతలు నూర్పిడి చేసేందుకు కూలీల కొరత అనుకుంటే యంత్రాల డిమాండ్ అధికంగా ఉంది. వర్షాలకు పంట వాలిపోవడం, కోసినా పనలు తడిసిపోవడంతో యంత్రాలతో కోత, నూర్పిడి చేయడం ద్వారా ఎండుగడ్డి చేతికి రాకుండా పోయింది. చాలా చోట్ల పొలాల్లోనే గడ్డి కుళ్లిపోయింది. ఈ పరిస్థితుల్లో మూగజీవాలకు ఈ ఏడాది గడ్డి కొరత తప్పదని రైతులు మదనపడుతున్నారు. ప్రస్తుతం పరిస్థితి కొంత మేరకు సజావుగా ఉన్నా రానున్న ఎండాకాలంలో ఈ తీవ్రత ప్రభావం అధికంగా ఉంటుందని వాపోతున్నారు.

● సాగు వ్యయం పెరిగినా...

వర్షాలు సక్రమంగా కురిసినా, కురవకపోయినా ధాన్యం ధరలు గిట్టుబాటు కాకున్నా, తిండి గింజలు, మూగజీవాలకు గడ్డి లభ్యమవుతుందన్న ఆశతో రైతులు వరి పండిస్తున్నారు. సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంతో యాంత్రీకరణ పద్ధతులను అనుసరిస్తున్నారు. వరి కోతకు వచ్చిన సమయంలో యంత్రాలతో నూర్పిడి చేస్తుండడంతో సగానికి సగం గడ్డి చేతికి రాకుండాపోతుంది. ఈ ఏడాది వరి పనలు తడవడంతో ఆ కాస్త గడ్డి కూడా లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఎకరాకు 60 కట్టలు



వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా రైతులు బెల్టు యంత్రాలతో వరి నూర్పుడులు చేపట్టారు. సాధారణంగా ఎకరాకు 100 నుంచి 110 కట్టలు ఎండుగడ్డి మిగిలాలి. సగం గడ్డి చేతికి అందక ప్రస్తుతం 60 కట్టలు మాత్రమే గడ్డి మిగులుతోంది. అదే కూలీలతో కోతలు చేస్తే పశుగ్రాసం సమృద్ధిగా మిగిలేది.

జేష్ఠాది సాల్మన్, గడ్డి యంత్ర యజమాని

● ఎండాకాలం కష్టమే



వర్షాల కారణంగా వందల ఎకరాల్లో వరి తడిసి ముద్ద అయింది. చాలా చోట్ల రైతులు గడ్డి సేకరణ చేయకుండా అలాగే వదిలేశారు. కుళ్లి, ఎండిన గడ్డి పొడి పొడిగా మారిపోయింది. వరి గడ్డి కోతల ప్రభావం రానున్న ఎండా కాలంలో తీవ్రంగా ఉండబోతోంది. పశువుల మేతకు కొందామన్నా గడ్డి దొరికే పరిస్థితి ఉండదు.

యు.చిన్నపుల్లయ్య, పాడి రైతు



యంత్రాలతో వరి నూర్పిడి

రూ.50 లక్షలతో మెటల్ రోడ్డు మంజూరు

● పరిశీలించిన అధికారులు



రోడ్డును పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

దువ్వూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గుడిపాడు నుంచి గొల్లపల్లె వరకు పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ.50 లక్షలతో మెటల్‌రోడ్డు మంజూరైంది. ఆదివారం పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు చంద్రశేఖర్‌రెడ్డి రోడ్డును పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించి పలు సూచనలు చేశారు. గుడిపాడు నుంచి మనేరాంపల్లె, చల్లబసాయిపల్లె, గొల్లపల్లె వరకు రూ.2.5 కి.మీ. పొడవునా నిర్మించి రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలని తెలిపారు. పనులను నాణ్యతగా చేయాలని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మధుసూదన్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీరు సుబ్రమణ్యం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సుధారాణి, జాకీర్, పార్టీ మండల కన్వీనర్ రమణారెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌జీఓ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి

బద్వేలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఎన్‌జీఓ తాలూకా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి కోరారు. స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న జీపీఎఫ్, ఏపీజీఎల్‌ఐ, సరెండర్ లీవులు, డీఏ, అరియర్స్ వంటి సమస్యలపై ప్రభుత్వం పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అనంతరం ఏపీ ఎన్‌జీఓ సంఘం బలోపేతంపై ఆయన చర్చించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏవైనా సమస్యలు ఉంటే ఏపీఎన్‌జీఓ సంఘం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. అనంతరం అనంతరం ఏపీఎన్‌జీఓ కేలండర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఏపీ కార్యదర్శి నరసింహారెడ్డి, ట్రెజరర్ శివరామిరెడ్డి, తాలూకా అసోసియేషన్ ప్రెసిడెంట్ సాదు వెంకటేశ్వర్లు, తాలూకా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేమన గొప్ప దార్శనికుడు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వేమన గొప్ప దార్శనికుడని వేమన సేవా సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈనెల 19న వేమన జయంతిని పురస్కరించుకుని ఆదివారం గ్రేడ్-1 గ్రంథాలయంలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వేమన పద్య పఠనం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వేమన పద్యాల ద్వారా అందరికీ అర్థమయ్యేలా జీవిత సత్యాలను బోధించారన్నారు. అంటరానితనాన్ని, మూఢ నమ్మకాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారని, సమసమాజ స్థాపనకోసం సహపంక్తి భోజనాలను ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో వేమన సేవా సమితి అధ్యక్షుడు మురికూటి సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారి రామచంద్ర, లైబ్రేరియన్ తిరుపతమ్మ పాల్గొన్నారు.

మెడికల్ రెప్రజంటేటివ్స్ సమస్యలు పరిష్కరిస్తాం



ఎన్నికైన ఏపీ మెడికల్ రెప్రజంటేటివ్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు

ప్రొద్దుటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ మెడికల్ రెప్రజంటేటివ్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఆసంస్థ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు శివనాథ్ వర్కింగ్ కమిటీ సభ్యులు రామాంజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక హౌసింగ్ బోర్డులోని టీఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో వార్షిక నివేదికను వెల్లడించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. అధ్యక్షుడిగా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎంఎల్ నరసింహులు, రవిప్రకాష్, కార్యదర్శిగా సి రామలింగారెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎస్ రెడ్డెయ్య, వి సూర్య పెద్దిరాజు, కోశాధికారిగా జె కిష్ట సుమంత్ కమిటీ సభ్యులుగా ఎం మాధవ వి విమల్ కుమార్, పి శ్రీకాంత్, పి నవీన్, ఎం సురేంద్ర, జి రామాంజనేయులు ఎస్‌డి ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీటి కోసం పైపులైను ఏర్పాటు



బ్రహ్మంగారిమఠం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మల్లేపల్లె పంచాయతీ లింగాలదిన్నెపల్లె, మల్లేపల్లె గ్రామ ప్రజలకు తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. గతంలో సమస్య ఉందన్న విషయాన్ని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు తెలియజేయడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో పైపులైను ఏర్పాటు చేయాలని సర్పంచ్‌కు విషయాన్ని తెలియజేయడంతో ఆదివారం సర్పంచ్ భర్త చిలమల నారాయణ పైపులైను ఏర్పాటు చేశారన్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ఉంటుందని చిలమల నారాయణ అన్నారు.

ప్రసాద్ కుటుంబానికి ఆర్థిక సాయం



ప్రసాద్ కుటుంబీకులకు ఆర్థిక సాయం అందిస్తున్న బలిజ సంఘం నేతలు

పోరుమామిళ్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కడపలో జరిగిన బలిజ సంఘం సమావేశంలో బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై మృతి చెందిన పోరుమామిళ్ల వాసి రాళ్లపల్లె ప్రసాద్ కుటుంబానికి బలిజ సంఘం నేతలు రూ.40వేలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం బలిజ సంఘం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు పుట్టా సుబ్రమణ్యం, లోకయ్యశెట్టి, వెంకటయ్య, శంకరయ్య, నరసయ్య, రమేశ్, విజయకుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబానికి రూ.40వేలు ఆర్థికసాయం అందించారు.

23న సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ పుట్టిన రోజు సందర్భంగా నేతాజీ సోషియల్ స్టడీస్ క్లబ్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష 23న నిర్వహిస్తున్నట్లు నేతాజీ సోషియల్ స్టడీ క్లబ్ జిల్లా కన్వీనర్ భాస్కర్‌రావు తెలిపారు. ఆదివారం ప్రతిభా పరీక్ష కరపత్రాలను కడప డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. డిప్యూటీ డీఈఓ, నేతాజీ సోషియల్ స్టడీస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు గురుకుమార్, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, జమాల్‌రెడ్డి, సుబ్బయ్య, మైసూర్, వన్నప్ప, కృష్ణమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి ఐదు బస్సులు



హైందవ శంఖారావానికి తరలి వెళుతున్న పోరుమామిళ్ల వాసులు

పోరుమామిళ్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన హైందవ శంఖారావానికి పోరుమామిళ్ల నుంచుట భారీగా ప్రజలు తరలివెళ్లారు. ఆదివారం పోరుమామిళ్ల నుంచి ఐదు ప్రైవేటు బస్సుల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ఫణిరావు, చెన్నయ్య, అవధానం శశికుమార్ తదితరులు తరలివెళ్లారు.

200 మందితో ఉచిత మెగా వైద్యశిబిరం

అట్లూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రెడ్డి మెడికల్ క్లినిక్ సెంటరులో ఆదివారం బద్వేలు సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వ హించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి 200 మంది హాజరైనట్లు నిర్వాహకులు శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు డాక్టర్ అరుణ్‌జిత్, డాక్టర్ సుమన్ ఆధ్వర్యంలో మండల ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బద్వేలు మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీ - ఒకరికి గాయాలు

బద్వేలు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని స్థానిక నెల్లూరు రోడ్డులో ఆదివారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఒకరికి గాయాలు కావడంతో చుట్టుపక్కల ప్రజలు 108కు సమాచారం ఇవ్వడంతో గాయపడిన వ్యక్తిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన ఘటనపై ఆరా తీశారు.

సగర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండీ మర్చంట్ సమీపంలో ఆదివారం జిల్లా సగర సంఘం రూపొందించిన 2025 క్యాలెండర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు మజ్జారి వీరమోహన్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లాయర్ చంద్ర, కోశాధికారి జోరు శివప్రసాద్, సగర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర మురళీధర్, పల్లవోలు రమణ, రామాంజనేయులు, వరికూటి సుబ్బరాయుడు, మజ్జారి లక్ష్మీనారాయణ, జగన్, వెంకటరమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర అసోసియేషన్ ఎన్నిక

ఉపాధ్యక్షుడిగా భూమిరెడ్డి శివనారాయణరెడ్డి



ప్రొద్దుటూరు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భూమిరెడ్డి శివనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన కార్యరవర్గ సమావేశంలో కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు వాసి శివనారాయణ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన ప్రస్తుతం ఆర్టీపీపీలో కార్మికుడిగా పనిచేస్తూ బాల్‌బ్యాడ్మింటన్ అభివృద్ధికి కృషి చేయడంతో ఆయన సేవలను గుర్తించి ఎన్నుకున్నారు. ఆయన ఎంపికపై బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు.

కెనాల్‌పై ఆక్రమణలు తొలగించాల్సిందే

తేల్చి చెప్పిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి




కాల్వ కట్ట వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మైలవరం ఉత్తర కాల్వ మీద వున్న ఆక్రమణలన్నీ తొలగించాల్సిందేనని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తేల్చి చెప్పారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన కాల్వ కట్టవాసులైన మహిళలతో చర్చించారు. కాల్వ మీద ఆక్రమణల తొలగింపుపై కొద్ది రోజుల గడువు ఇవ్వాలని మహిళలు ఎమ్మెల్యేకు విన్న వించారు. కాల్వకు త్వరలో మరమ్మతులు చేయాలని అందువల్ల వీలైనంత త్వరగా మైలవరం ఉత్తర కాల్వ మీద వున్న కట్టడాలన్నీ స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మరోసారి స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి కెసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మెన్ ద్వార్శల గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్తలో తహసీల్దార్‌పై ఫిర్యాదు

కొండాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తాళ్లప్రొద్దుటూరు మండల టీడీపీ ఉపాధ్యక్షుడు బుగ్గనగారి చంద్రశేఖర్‌రెడ్డి తహసీల్దార్ శోభన్‌బాబుపై లోకాయుక్తాలో ఫిర్యాదు చేశాడు. వైసీపీ ప్రభుత్వంలో తాళ్లప్రొద్దుటూరు పునరావాస కాలనీలో డీకేటీ భూములకు సంబంధించి పలు ఆరోపణలు చేస్తూ అప్పటి కొండాపురం తహసీల్దార్ శోభన్‌బాబుపై 2024 డిసెంబరు 13న కర్నూలు లోకాయుక్తాలో ఫిర్యాదు చేశాడు. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలు సమర్పించాలని, 2025 ఫిబ్రవరి 21న లోకాయుక్తా కోర్టులో హాజరు కావాలని, లోకాయక్తా కోర్టు తనకు నోటిసు పంపినట్లు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ శోభన్‌బాబును వివరణ కోరగా చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపణల్లో నిజం లేదని, తనకు లోకాయుక్తా నుంచి ఎటువంటి నోటీసు అందలేదని తెలిపారు.

మల్లేశ్వర కోనలో నెమళ్ల విహారం



మల్లేశ్వరకోనలో సంచరిస్తున్న నెమలి

కొండాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రమైన మల్లేశ్వర కోన ప్రాంతంలో నెమళ్లు విహరిస్తున్నాయి. కోన ప్రాంతానికి వెళ్లే దారిలో నెమళ్లు దర్శనమిస్తూ స్థానిక ప్రజలను, భక్తులను ఆకట్టుకుంటున్నాయి. పలుసార్లు నెమళ్లు పురివిప్పి నాట్యం చేస్తూ కనువిందు చేశాయని, గుంపులు, గుంపులుగా ఇటువైపు వెళుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. తరచూ నెమళ్లు దర్శనమిస్తుండడంతో ఈ ప్రాంతంలో నెమళ్లు ఎక్కువగా సంచరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఫారెస్టు అధికారుల అదుపులో ఇద్దరు నిందితులు

పోరుమామిళ్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అడవిపంది మాంసం కలిగి ఉన్నారనే అభియోగంపై ఇద్దరిని అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రామేశ్వరం సమీపంలో ఇద్దరి వద్ద అడవి పంది మాంసం ఉందనే సమాచారం అందడంతో వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. రామేశ్వరం ప్రాంతంలో 15 వాసాలు స్వాధీనం చేసుకుని రూ.6500 జరిమానా విధించారు.

'పథకాల అమలులో జగన్ మాట తప్పారు'

చాపాడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో మాట తప్పారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగమైన అమ్మఒడి, రైతు భరోసా పథకాల లబ్ధిదారులకు డబ్బు తగ్గించి ఇచ్చాడన్నారు. రైతు భరోసా పథకానికి రూ.6 వేలు తగ్గించారన్నారు. అమ్మఒడి డబ్బులు కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తల్లికి వందనం కింద జూన్‌లో కుటుంబంలోని విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి రూ.20 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు రూ.20 వేలు చొప్పున త్వరలో ఇస్తున్నట్లు చెప్పారు.

డీఈఓను తొలగించాలి

- పీడీఎస్‌యూ -

కడప ఎడ్యుకేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నిత్యం వివాదాస్పంగా వ్యవహరిస్తున్న డీఈఓ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకుని వెంటనే తొలగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా చరిత్రలోనే 24 ఉపాధ్యాయ సంఘాలు ఒక్కటిగా చేరి జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షిని తొలగించాలని డిమాండ్ చేయడం ఇదే తొలిసారి అన్నారు. మీనాక్షి జిల్లాలో ఏ పాఠశాలకు వెళ్లినా ఉపాధ్యాయులు భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ఆమె సైకో ప్రవర్తనతో ఒక ఉపాధ్యాయుడు మృతిచెందాడని, దీంతో ఆయన కుటుంబం రోడ్డున పడిందన్నారు. డీఈఓ, సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే సిబ్బందిని కూడా వేధిస్తోందన్నారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ జోక్యం చేసుకుని డీఈఓను ప్రభుత్వానికి సరెండర్ చేయాలన్నారు.

కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు మనోజ్, అన్నమయ్య జిల్లా పీడీఎస్‌యూ నాయకుడు మహేష్ పాల్గొన్నారు.

కాలు దువ్వుతున్న కోళ్లు

బరులు సిద్ధం చేస్తున్న పందెం రాయుళ్లు

హెచ్చరికలు చేస్తున్న పోలీసులు



లింగాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): భోగి, సంక్రాంతి, కనుమపండుగ సందర్భంగా పందెం కోళ్లు కాలు దువ్వుతున్నాయి. ఏటాలాగే ఈ ఏడాదీ కోళ్ల పందెం నిర్వహించేందుకు పందెం రాయుళ్లు బరులు సిద్ధం చేసుకుంటున్నారు. గతంలో ఈ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహించే ఆనవాయితీ లేదు. అయితే కోస్తా ప్రాంతంలో ఏటా నిర్వహించే కోడిపందేలను చూస్తూ వాటి ఆకర్షణకు లోనైన పలువురు కోడిపందెం రాయుళ్లు క్రమంగా కోస్తా ఆనవాయితీని ఈ ప్రాంతానికి తీసుకువచ్చా రు. మూడు నాలుగేళ్లగా క్రమం తప్పకుండా కోడిపందేలను నిర్వహిస్తున్నారు. ఒక వైపు పోలీసులు దాడులు చేసి పట్టుకుని హెచ్చరించినా వారు మాత్రం తగ్గడం లేదు. ఏటా మాదిరే ఈ ఏడాది కూడా కోడి పందేలను నిర్వహించేందుకు పందెం రాయుళ్లు బరులు సిద్ధం చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మధుసూదన్‌రావు మురారిచింతల, అంబకపల్లె, గుణకణపల్లె, ఎగువపల్లె, దిగువపల్లె, కోమన్నూతల తదితర గ్రామాల్లో పర్యటించి కోడిపందేలను నిర్వహించేందుకు ఎటువంటి అనుమతులు లేవు. ఎవరైన పండుగ సందర్భంగానైనా సరే కోడి పందేలు నిర్వహిస్తే కఠజన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పడుగను పురష్కరించుకొని కోడి పందేలు, జూదం నిర్వహించడం ఆమోదనీయం కాదని అందరు సహకరించాలని ఆయన కోరారు.